క్లుప్తంగా

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఉరవకొండ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణ, వీఆర్‌ఓ గౌసియా, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయండి

కుందుర్పి: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే వాతావరణ మార్పులపై సదస్సును విజయవంతం చేయాలని ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి ప్రొఫెసర్లు పురుషోత్తంరెడ్డి, దొంతి నరశింహారెడ్డి, ఏఎఫ్ ఎకాలజీ టీం లీడర్ అరుణ హాజరవుతారన్నారు.

ఆర్టీసీ కండక్టరు నిజాయితీ



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఆర్టీసీ కండక్టర్ వివేకానంద

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టరుగా పనిచేస్తున్న వివేకానంద నిజాయితీ చాటుకున్నాడు. ఈనెల 6న కళ్యాణదుర్గం డిపోనకు చెందిన ఆర్టీసీ నైట్ సర్వీస్ బస్సు బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వచ్చింది. ప్రయాణికులంతా దిగిపోయాక బస్సు సీట్లో సెల్‌ఫోన్ (రూ.13 వేల విలువ గలది) ఉన్నట్లు గమనించిన కండక్టరు వివేకానంద సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ అధికారులకు అప్పగించాడు. సెల్‌ఫోన్లో ఉన్న కాల్ లిస్టు మేరకు పలువురికి కాల్ చేసి సెల్ బస్సులో మర్చిపోయినట్లు చెప్పారు. స్నేహితుల ద్వారా తెలుసుకున్న బాధితుడు గొనేహల్ క్రాస్‌కు చెందిన ప్రశాంత్‌రెడ్డి సెల్‌ఫోన్ తనదే అంటూ ఆర్టీసీ అధికారులను ఆశ్రయించాడు. విచారించిన అధికారులు శుక్రవారం కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో ఆవరణలో కండక్టర్ వివేకానంద చేతుల మీదుగా బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు కండక్టర్ వివేకానందకు, ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డిపో డీసీ ఇందిరమ్మ, ఆన్‌డ్యూటీ కంట్రోలర్ డీకే మూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



హౌసింగ్ ఏఈ శివారెడ్డి

బెళుగుప్ప: లబ్ధిదారులు జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ శివారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఏఈ పరిశీలించారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 16న సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టనుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మొత్తం 1,705 ఇళ్లు మంజూరు కాగా 926 పూర్తయ్యాయని, మరో 456 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలకు వెలుగు పథకంలో ఉన్న మహిళా సభ్యులు బ్యాంకుల ద్వారా రూ.35,000 రుణాన్ని పొందవచ్చన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణస్థాయి ఆధారంగా ఎస్టీ, ఎస్సీ లబ్ధిదారులకు ఆర్డీటీ రూ.50,000 ఉచితంగా అందిస్తోందన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

ఉరవకొండ: ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తామని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఫారం-6 కు సంబందించి 13,056 దరఖాస్తులు స్వీకరించామని, ఇందులో 1,984 తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. ఈఆర్‌ఓ లాగిన్‌లో 2,385 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం-7 కు సంబంధించి 6,872 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 2,274 పెండింగ్, ఈఆర్‌ఓ లాగిన్‌లో 4,299 ఉండగా, 296 తిరస్కరణకు గురయ్యాయన్నారు. ఫారం-8కు సంబందించి 9,805 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో ఈఆర్‌ఓ లాగిన్‌లో 8,581, 895 పెండింగ్‌లో ఉన్నాయని, 296 తిరస్కరణకు గురయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

పల్లెల్లో గొడవలకు 'టీడీపీ' ఆజ్యం

- వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే కుట్ర రాజకీయాలు



రాయదుర్గం: సాధారణ ఎన్నికలు దగ్గరపడేకొద్దీ వర్గ విభేదాలకు 'టీడీపీ' ఆజ్యం పోస్తోంది. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో చిచ్చుపెట్టేలా ప్రేరేపిస్తూ ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తోంది. దీనంతటికీ ఆ పార్టీలోని ఓ ముఖ్యనాయకుడే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలో ఇటీవల కొన్ని గ్రామాల్లో ఈ పరిణామాలు చోటుచేసుకోవడమే నిదర్శనం. చిన్న కారణాలకే ఒకరి మధ్య మరొకరిలో మనస్పర్థలు పెరిగి తగవులకు దారి తీస్తున్నాయి. దీన్ని అదునుగా తీసుకున్న ఓ నాయకుడు పచ్చమూకలను రంగంలోకి దింపి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఇటీవల మూడు గ్రామాల్లో వర్గ విభేదాలు తలెత్తాయి. వాటిని సద్దుమణిగించేందుకు పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఓ గ్రామంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోకి రావడంతో వారం క్రితం పికెట్ ఎత్తేశారు. మరో గ్రామంలో రెండు వర్గాల వర్గాల మధ్య వివాదాలు రచ్చకెక్కాయి. అక్కడ భద్రత చర్యలు చేపట్టాల్సి వచ్చింది. తాజాగా ఇంకో గ్రామంలో న్యాయం కోరుతూ గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

ముందుచూపుతో ఆలోచించాలి

సంబంధం లేని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించాల్సిన చోట ఘర్షణ వాతావరణం సరైంది కాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పెద్దరికం పేరుతో రంగంలోకి దిగిన పచ్చమూకలు కొందరు ఏదో ఓ వర్గానికి మద్దతుగా నిలిచి వారి ఓట్లు రాబట్టుకునేలా కుట్రలకు పాల్పడుతున్నారు. వారి స్వార్థ రాజకీయాల కోసం పేద వర్గాలను బలిచేస్తున్నారు. ఆ నిందను జగన్ ప్రభుత్వంపై నెట్టేలా ఐ-టీడీపీలో దుష్ప్రచారం మొదలు పెట్టారు. ఓ వర్గంపై దాడులు పెరిగాయంటూ మీడియా ముందు గగ్గోలు పెడుతూ ప్రజలను మభ్య పెడుతున్నారు. ప్రజలు ముందుచూపుతో ఆలోచించి రెచ్చగొట్టే వారి పట్ల జాగ్రత్త వహించాలని మేధావులు, పోలీసులు కోరుతున్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

గ్రామాల్లో అన్ని వర్గాల వారు వివాదాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం కొనసాగించాలి. చిన్న సమస్య ఉత్పన్నమైతే పెద్దల మాట వినాలి. లేదంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. కౌన్సెలింగ్ ద్వారా ఇరు వర్గాలకు సర్దిచెబుతాం. ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించడం, గొడవలను ప్రేరేపించడం లాంటిది మంచిది కాదు. అలాంటి వారిపై కఠిన చర్యలు చేపడతాం. ఎంతటి వారైనా సరే ఉపేక్షించం.

– టీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

జీబీసీకి నీరిచ్చి రైతులను ఆదుకోండి



జేసీని కలసి సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, విడపనకల్లు మండల రైతులు

విడపనకల్లు: మండలంలో గుంతకల్లు బ్రాంచి కెనాల్(జీబీసీ) కింద రైతులు వేల ఎకరాల్లో మిరప,పత్తి, తదితర పంటలు లక్షల పెట్టుబడులు పెట్టి సాగు చేశారని, హంద్రీనీవా నీరును జీబీసీకీ మళ్లించి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, రైతులు శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ కేతన్ గార్గ్‌ను కలిసి కోరారు. విడపనకల్లు మండల వ్యాప్తంగా జీబీసీ ఆయకట్టు కింద మిరప, పత్తి ఇతర పంటలు రైతులు సాగు చేశారని జేసీకి విశ్వ వివరించారు.జీబీసీకి సాగునీరు బంద్ కావడంతో పంటలన్నీ ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం పంటలన్నీ పూత, పిందె దశలో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితిలో హంద్రీనీవా నీరును జీబీసీకి మళ్లించి పంటలను కాపాడాలని జేసీని రైతులతో కలసి మాజీ ఎమ్మెల్యే కోరారు. 30 వేల ఎకరాల్లో మిరప, 20 వేల ఎకరాల్లో పత్తి, వరి తదితర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని జేసీకి వివరించారు. జేసీ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హంద్రీనీవా ద్వారా జీబీసీకి నీరు అందించే ప్రక్రియ చేపట్టేలాచూస్తానని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, పార్టీ మండల కన్వీనర్ బసన్న, ఎస్సీసెల్ జిల్లా నాయకులు సుంకన్న, సర్పంచులు ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం





కణేకల్లు దుర్గాదేవి ఆలయం, బెళుగుప్ప విఘ్నేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కణేకల్లు: పట్టణ శివారులోని దుర్గాదేవీ ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక మాస లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలను వెలిగించి మొక్కుబడులను తీర్చుకొన్నారు. అంతకు ముందు కర్ణాటకలోని బళ్లారి నుంచి కళ్యాణస్వామి, ఉరవకొండ గవిమఠ కరిబసవేశ్వరస్వామితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన చన్నవీరశివాచార్యులు, ప్రణవానందగిరి స్వామి, విశ్వనాథస్వామి ఆధ్మాత్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసంలో శుక్రవారం రోజు ఏకాదశి రావడం అత్యంత పవిత్రమైందన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని విఘ్నేశ్వరస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. ముందుగా కార్తీక దామోదర వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోనూ ఆలయ పరిసరాల్లోనూ భక్తజనం కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆలయాల్లో కార్తీక మాసోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వస్తున్నారు. కార్తీకమాసం చివరి శుక్రవారం పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో శ్రీరాములు వంశీయుల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం, పల్లకి సేవలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాల ముగ్గులతో శివుని పూజ విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పట్టణంలోని చన్నవీరస్వామి, శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, రేవణసిద్దేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధన చేపట్టారు.

అబద్ధాలకోరు చంద్రబాబును నమ్మొద్దు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: పేదలకు ఏనాడూ మంచి చేయని అబద్ధాల కోరు చంద్రబాబును నమ్మి మోసపోవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. నవరత్నాల సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచిన దేశంలోనే ఏకైక నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే నన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలోని 28, 29 వార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, వార్డు ఇన్‌చార్జ్ వైజాగ్ రిబ్కా, పట్టణ కన్వీనర్ అరవా శివప్పతో కలసి వారు ప్రారంభించారు. తొలుత సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ప్రారంభించి, సచివాలయ సమీపంలో నాయకులతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందా? ప్రస్తుత జగనన్న పాలనలో మంచి జరిగిందా అనే తేడా ప్రజలు గమనించాలన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించి సంక్షేమ పథకాలను శాశ్వతంగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీలక్ష్మి, పద్మజ, నసీమా, శారదమ్మ, డిష్ గోవిందు, ఫకృద్దీన్, షబ్బీర్, బండి అజయ్, శ్రీనివాసరెడ్డి, కొంతం దేవరాజు, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, బ్యూలా, వార్డు ఇన్‌చార్జ్‌లు, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న కాపు భారతి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వాస్పత్రిలో నిపుణులైన స్పెషలిస్ట్ వైద్యులచే మెగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి చొరవతో ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం అనంతపురానికి చెందిన సన్‌రే హాస్పిటల్ స్పెషలిస్ట్ వైద్యులు, జనరల్ మెడిసన్ స్రవంతి నివేదితరెడ్డి, ధనుంజయ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 268 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి చికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా కాపు భారతితోపాటు వైద్యురాలు స్రవంతి నివేదితరెడ్డి మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందజేసేందుకు క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, ఏపీ హౌసింగ్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, ఫకృద్దీన్, మంజునాథ, కోఆప్షన్‌సభ్యులు నజీర్, మాజీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కొలిమి ఆనంద్, మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

బెళుగుప్ప: మండలంలోని వికలాంగ సమాఖ్య సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు , విద్యార్థులు కలసి అంతర్జాతీయ విబిన్న ప్రతిభావంతుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూర్యోదయ మండల వికలాంగ సమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షుడు మారెప్ప, జిల్లా కమిటీ అధ్యక్షులు రాజేష్, దురగప్ప, మాబు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటప్రసాద్ వికలాంగ సమాఖ్య సభ్యులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఎంఈఓ మల్లారెడ్డి, ఆర్‌డీటీ హెచ్‌ఆర్ విభాగం నుంచి రామాంజినేయులు, ధనలక్ష్మి, వికలాంగ సమాఖ్య జిల్లా అధ్యక్షులు వసంతకుమార్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా దివ్యాంగులు ముందుకు సాగాలన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

శెట్టూరు: పుస్తకాలు మోసే వయస్సులో ఆడపిల్లలకు పుస్తెల భారం వద్దని ఎంఈఓ శ్రీధర్, ఐసీడీఎస్ సీడీపీఓ వనజాక్కమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో 'బాలల పరిరక్షణ బాధ్యత అందరిది' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ప్రిన్సిపాల్ గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా కిట్ల పంపిణీ

బెళుగుప్ప: మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలకు సంబంధించిన కిట్లను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పంపిణీ చేశారు. శుక్రవారం ఎంఈఓ మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఎంఈఓ-2 హరికృష్ణ, పీడీ రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లిలో శుక్రవారం జోగిని, బసివిని, మాతంగి ఉలిగమ్మలకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నాగలక్ష్మి శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ గ్రామంలో మండలంలోని జోగిని, బసివిని, మాతంగిలు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోగినీ, బసివినిల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జోగినీ, బసివినిలకు వెంటనే ఫించన్లు మంజూరు చేయాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం ఆమె వారికి నూనె, ఉప్మారవ్వ, బియ్యం, కందిబేడలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

రక్త నమూనాల సేకరణ

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం పది సంవత్సరాలు పైబడిన వారి రక్త నమూనాలను వైద్య సిబ్బంది సేకరించారు. మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి నాగరంగయ్య, హైల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, ముకుంద, రాఘవేంద్ర, నిమ్మల వెంకటేష్ ఆధ్వర్యంలో 305 మంది రక్తనమూనాలు సేకరించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి మాట్లాడుతూ మైక్రో ఫైలేరియా గుర్తించడానికి, క్యూలెక్స్ దోమ కాటు వల్ల వ్యాపించే రోగాలను నిరోధించడానికి రక్తనమూనాలు సేకరిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ సతీమణికి కన్నీటి వీడ్కోలు









కొనకొండ్లలో వై.ఉమాదేవి అంతిమయాత్ర జరుగుతున్న దృశ్యం, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, మంత్రులు ఉషశ్రీచరణ్, గుమ్మనూరు జయరాం

వజ్రకరూరు: శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవికి ప్రజాప్రతినిధులు, అభిమానులు, కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వివిధ పార్టీల నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె గురువారం ఉదయం మృతిచెందారు. హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి స్వగ్రామం కొనకొండ్లకు పార్థివదేహాన్ని తీసుకువచ్చారు. ఆమె మరణంతో భర్త ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కుమారుడు వై.భీమిరెడ్డి, కుమార్తె వై.కీర్తిరెడ్డి, గుంతకల్లు , ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగి రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. ఉరవకొండ, గుంతకల్లు నియోజవర్గాలతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలు, కర్నూలు, కర్ణాటక, తెలంగాణా తదితర ప్రాంతాల నుం వేలాది మంది అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు తదితరులు వేలాదిగా చేరుకుని ఉమాదేవి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుక్రవారం ఉమాదేవి అంతిమ సంస్కరాలు నిర్వహించారు. మంత్రులు ఉషశ్రీ చరణ్, గుమ్మనూరు జయరాం, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాదవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, పీవీ సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కర్నూల్ జిల్లా నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీజేపీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, పల్లె రఘునాథరెడ్డి తదితరులు ఉమాదేవి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కుమారుడు వై.భీమిరెడ్డిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు మంత్రి రాక

కంబదూరు: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉషశ్రీ చరణ్ శనివారం కంబదూరుకు రానున్నట్లు సర్పంచ్ పద్మావతమ్మ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు మండల కేంద్రంలోని మీసేవ కార్యాలయం సమీపంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఒకరికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం వద్ద శుక్రవారం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎలక్ట్రికల్ పనులు చేసే రాజమండ్రికి చెందిన మణికంఠ, దుర్గారెడ్డి రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం వెళ్తుడగా నరసాపురం వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో దుర్గారెడ్డికి కాలు విరగగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తక్షణసాయం అందజేత

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో శుక్రవారం అనారోగ్యంతో వన్నూరప్ప అనే వ్యక్తి మృతి చెందాడు. సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుళేసు ఆధ్వర్యంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.పది వేలు అందజేశారు. మిగిలిన బీమా నగదు త్వరలో నామినీ ఖాతాకు జమవుతుందన్నారు.

డిగ్రీ కాలేజీ నిర్మించాలంటూ ధర్నా

కణేకల్లు: మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఇంటర్ కాలేజీ విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కణేకల్లులో డిగ్రీ కాలేజీ లేనందున ఉరవకొండ, రాయదుర్గం పట్టణాలకు వెళ్లి చదువుకుంటున్నామని, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల విద్యార్థుల సౌకర్యార్థం కణేకల్లులో డిగ్రీ కాలేజీ నిర్మించాలని వారు కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

నేడు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో 11 కె.వి.విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించనున్నట్లు ఏఈ బాలచంద్ర శుక్రవారం తెలిపారు. రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 33-11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మూడు ఫీడర్ల ద్వారా 10 గ్రామాలకు సంబంధించి వ్యవసాయ, గృహ అవసరాల వినియోగదారులకు లోఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

సాంకేతిక లోపంతోనే ప్రమాదం



డీఈఈ రవీంద్రబాబు

కళ్యాణదుర్గం: 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో కెపాసిటీ బాండింగ్ సెల్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతోనే ప్రమాదం జరిగిందని కళ్యాణదుర్గం డీఈఈ కె.రవీంద్రబాబు అన్నారు. గురువారం రాత్రి విద్యుత్ సబ్ స్టేషన్లో సాంకేతిక లోపంతో జరిగిన ప్రమాదంపై శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కెపాసిటీ బాండింగ్ సెల్ ధ్వంసం కావడం వల్ల ప్రమాదం జరిగిందన్నారు. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పాటు అగ్ని కీలలు ఎగిసిపడ్డాయన్నారు. దీంతో అర గంటకు పైగా ఆరు మండలాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే అప్రమత్తమై సిబ్బందితో కలసి పాడైన సెల్ స్థానంలో వేరే సెల్స్‌ను అమర్చామన్నారు కళ్యాణదుర్గం సబ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు 30 నిమిషాల్లో, మరో రెండు మండలాలకు గంట వ్యవధిలోనే విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా బంగి శివ



రాయదుర్గంటౌన్: అనంతపురం ఉత్తర ప్రాంత ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా రాయదుర్గం పట్టణానికి చెందిన బంగి శివ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కళ్యాణదుర్గంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ 31వ జిల్లా మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు బంగి శివ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

నేడు పూల రథోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం కార్తీక దీపోత్సవం, పూల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి శుక్రవారం తెలిపారు. సాయంత్రం 7.30 గంటలకు ఆంజనేయస్వామి పూల రథోత్సవాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆలయ ప్రాంగణం లోభక్తులు దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.